నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 20 ఏప్రిల్ 2025 | RANGAREDDY

### ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటు

## కూలీ మృతి


మృతుడు అమృతయ్య(ఫైల్)

పెద్దేముల్, ఏప్రిల్ 19 : ఉపాధి హామీ పనులు చేస్తూ గుండెపోటుతో కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని దుర్గాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన వడ్డె పెద్ద అమృతయ్య శనివారం ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెలో నొప్పి వస్తున్నదని తోటి కూలీలతో చెప్పగా.. అక్కడే ఉన్న అతడి చిన్న భార్య తాండూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడి డాక్టర్లు పరీక్షించి అమృతయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో దుర్గాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. అమృతయ్యకు ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమా రులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అమృతయ్య చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఉపాధి హామీ టీఏ శ్రావణ్, ఎఫ్ఏ వెంకటయ్యతో కలిసి వచ్చి అమృతయ్య కుటుంబాన్ని పరామర్శించారు.



## రైతునే మాట్లాడనివ్వరా..?

భూభారతి పోర్టల్‌పై రైతులకు అవగాహన కల్పించేందుకు శనివారం శంకర్‌పల్లిలోని బద్దం మాణిక్యరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అంతప్పగూడ గ్రామానికి చెందిన ఓ రైతు స్టేజీ పైకి వెళ్లి మాట్లాడేందుకు యత్నించగా.. అక్కడ ఉన్న పోలీసులు అడ్డుకోవడంపై అతడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. రైతుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులనే మాట్లానివ్వరా అని మనస్తాపం చెందాడు.

– చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 19




## దండులా కదలిరండి..

రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పిలుపు

గ్రేటర్ హైదరాబాద్‌లోని కాలనీలు, బస్తీల్లో పార్టీ జెండా ఎగురవేసి ఆవిర్భా వ సభకు దండులా కదిలిరావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. 27 న జరిగే బీఆర్ఎస్ ఆవిర్భా వ సభ తెలంగాణ ప్రజల ఇంటి పండుగ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలు, కార్యకర్తలతో తెలంగాణ భవన్ లో శనివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ నుంచి మహాసభకు లక్షలాదిగా తరలిరావాలని కోరారు. పార్టీ ఆవిర్భా వం నుంచి బీఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యం, అనితరసాధ్యమైనవన్నారు. గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కలేదని చెప్పారు. హైదరాబాద్ ప్రజల ముందు కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు, దొంగనాటకాలు పనిచేయలేదని వెల్లడించారు. సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభివాణీదేవి, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ)

### కార్యకర్తలను వేధిస్తే.. మేము రాగానే

## మిత్తీతో సహా తీర్చుకుంటాం

- అధికారులు, పోలీసులను హెచ్చరించిన బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్
- కార్యకర్తలు పదవులు తీసుకోవడం కాదు.. కష్టపడి పని చేయాలని సూచన


సమావేశంలో మాట్లాడుతున్న మెతుకు ఆనంద్

బంట్వారం, ఏప్రిల్ 19 : అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే అధికారులకు.. తాము పవర్‌లోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ స్పష్టం చేశారు. శనివారం కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్ వద్ద ఆయన అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో పోస్టులు తీసుకోవడం కాదు.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని.. లేకుంటే అవి ఊడుతాయని హెచ్చరించారు. మండలంలోని కార్యకర్తలు పార్టీ ఆదేశాలను అనుసరించాలని, రానున్నది మన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. నేడు కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలు, అబద్ధపు హామీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని పేర్కొన్నారు. అక్కడక్కడ కొందరు అధికారులు పార్టీ కార్యకర్తలను వేధిస్తున్నారని.. పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని.. కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ కార్యకర్తలను వేధించిన వారికి తాము అధికారంలోకి రాగానే మిత్తీతో సహా తీర్చుకుంటామని హెచ్చరించారు. అధికారులు, పోలీసులు చట్టాల ప్రకారం నడుచుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా పార్టీ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఆయన ప్రకటించారు. అధ్యక్షుడిగా సుందరి అనిల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బాబు, బీసీ సెల్ అధ్యక్షుడిగా గొడ్డలి మల్లయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు.

### విడుదలైన నిధులు..

## ముందుకు సాగని పనులు

- రెండేండ్ల క్రితమే ఉత్తర్వులిచ్చినా ప్రారంభంకాని బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- పనులు ప్రారంభించామని కాంగ్రెస్ నేతల అబద్ధపు ప్రచారం
- కేవలం రోడ్డుకు ఇరువైపులా మట్టిపోసి వదిలేసిన వైనం
- భూ సేకరణ నిర్వాసితులకు నష్టపరిహారం అందజేసినా పనులు ప్రారంభించని కాంగ్రెస్ ప్రభుత్వం



వికారాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మీదుగా వెళ్లే బీజాపూర్ జాతీయ రహదారి నిర్మాణ పనులకు మోక్షం లభించడంలేదు. మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు పనులకు రెండేండ్ల క్రితమే నిధులు విడుదలై ఉత్తర్వులిచ్చినా ఇంకా ప్రారంభించకపోవడం గమనార్హం. మన్నెగూడ నుంచి కొడంగల్ వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులను గతంలోనే పూర్తి చేసిన కేంద్ర ప్రభుత్వం మన్నెగూడ–అప్పా జంక్షన్ వరకు రహదారి విస్తరణ పనులను పెండింగ్‌లో పెట్టింది. తదనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రహదారి విస్తరణ పనులకు అనుమతులొచ్చాయి. భూ సేకరణ నిర్వాసితులకు నష్ట పరిహారం అందజేసినప్పటికీ పనుల ప్రారంభంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఈ రహదారిపై ఏదో ఒక చోట నిత్యం ప్రమాదాలు జరుగుతూ మృత్యువాత పడుతున్నా కాంగ్రెస్ సర్కారు పట్టనట్లు వ్యవహరిస్తున్నది. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులపై ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులను ఎక్కడిక్కడ నిలదీస్తుండడంతో మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా మట్టి పోసి వదిలేసి చేతులు దులుపుకోవడం గమనార్హం. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతుంటే కేవలం మట్టి పోసి వదిలేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

### నిత్యం ప్రమాదాలు.. ట్రాఫిక్

మూడు, నాలుగేండ్లుగా బీజాపూర్ జాతీయ రహదారి అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల, మన్నెగూడ, పరిగి, కర్నాటకలోని బీజాపూర్ వరకు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. వారాంతపు సెలవుల్లో అయితే చెప్పనలవికాదు. ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలతో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లకూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నది. మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు 46 కిలోమీటర్లు వెళ్లాలంటే రెండు గంటల సమయం పడుతున్నదంటే ట్రాఫిక్ ఎలా ఉంటున్నదో అర్థం చేసుకోవచ్చు. భారీ వాహనాలు ముందు వెళ్తున్నాయంటే దారి పొడవునా ఒకటి కాదు రెండు కాదు.. పదుల సంఖ్యలో వీఐపీ కాన్వాయ్ మాదిరి వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి.

### రూ.928.41 కోట్లతో జాతీయ రహదారి విస్తరణ

అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి రూ.928.41 కోట్లతో రహదారి నిర్మాణానికి అంచనాలను రూపొందించారు. తొలుత రూ.800 కోట్లతో రహదారి విస్తరణ పనులకు సంబంధించి అంచనాలను రూపొందించినప్పటికీ, తదనంతరం మరో రూ.128 కోట్లకు పెంచారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. అప్పా జంక్షన్ నుంచి బీజాపూర్ రహదారి ప్రస్తుతం కొన్ని చోట్ల 25 మీటర్లు, మరికొన్ని చోట్ల 30 మీటర్లుగా ఉన్నది. రోడ్డు విస్తరణలో భాగంగా 60 మీటర్ల మేర రహదారి విస్తరించి నాలుగు లేన్లుగా మార్చనున్నారు. ఇప్పటికే మన్నెగూడ నుంచి పరిగి, కొడంగల్, బీజాపూర్ వరకు 45 మీటర్ల మేర మూడు లేన్ల రహదారిగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు వెళ్లే జాతీయ రహదారి మధ్య ఉన్న గ్రామాల నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి రాకుండా అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా నిర్మించనున్నారు. 46 కిలోమీటర్ల పరిధిలో ఆరు భారీ అండర్‌పాస్ బ్రిడ్జిలను, ఎనిమిది ప్రాంతాల్లో చిన్న అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించి అందుబాటులోకి తీసుకురానున్నారు. బైపాస్ రోడ్లను కూడా నిర్మించేందుకు ప్లాన్ చేశారు. రెండు బైపాస్ రోడ్లు కూడా జిల్లాలోనే నిర్మించనున్నారు. మొయినాబాద్ వద్ద 4.35 కిలోమీటర్ల మేర, చేవెళ్ల వద్ద 6.36 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లను నిర్మించనున్నారు. నాలుగు లేన్ల రహదారిగా విస్తరిస్తున్న దృష్ట్యా 12 లేన్ల టోల్ ప్లాజాను అంగడిచిట్టంపల్లి వద్ద ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు.


ఇరుకు రోడ్డుపై వాహనాల రాకపోకలు

## సబ్సిడీ అంతా గ్యాసే..!



- వినియోగదారులకు చేరని గ్యాస్ సబ్సిడీ
- మహాలక్ష్మి పథకం పేరిట అరకొర కనెక్షన్లే..
- హామీలను అమలు చేయని కాంగ్రెస్ సర్కారు

రంగారెడ్డి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇవ్వటంతో మహిళలు పెద్దఎత్తున ముందుకొచ్చి ఆ పార్టీకి ఓట్లు వేశారు. తీరా అధికారం చేపట్టాక కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచిందని మహిళలు వాపోతున్నారు. మహాలక్ష్మి పథకం పేరుతో రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుని డబ్బులు చెల్లించినవారికి తిరిగి సబ్సిడీ డబ్బులు తమ ఖాతాల్లోకి రావటంలేదని వినియోగదారులు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సుమారు తొమ్మిది లక్షల వరకు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 70 శాతానికి పైగా తెల్ల రేషన్‌కార్డు కలిగి అభయహస్తానికి అర్హులుగా ఉన్నారు. కాని, వారిలో ఎవరికీ సబ్సీడీ రావటంలేదని మహిళలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇండియన్, భారత్, హెచ్‌పీ వంటి గ్యాస్ కనెక్షన్లను జిల్లా ప్రజలు వాడుతున్నారు. వీరికి మహాలక్ష్మి పథకం 500లకే సిలిండర్ ఇవ్వాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తికావస్తున్నప్పటికీ లబ్ధిదారులకు మాత్రం సబ్సిడీ అందటంలేదని వాపోతున్నారు.

### పెరిగిన గ్యాస్ ధరలతో మరింత భారం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచటంతో సామాన్యులపై మరింత భారం పడింది. ఒక్కో సిలిండర్‌కు రూ.50 చొప్పున పెంచడంతో గ్యాస్ ధర రూ.855 నుంచి రూ.905కు చేరింది. పెరిగిన గ్యాస్ ధరలతో ప్రతి నెల జిల్లా ప్రజలపై నాలుగు నుంచి ఐదు కోట్ల భారం పడుతున్నది. ఓవైపు సబ్సిడీ రాక.. మరోవైపు పెంచిన గ్యాస్ ధరలతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ ముప్పైవేల వరకు గ్యాస్ కనెక్షన్లు బుక్ చేసుకుంటున్నారు. గ్యాస్ ధరలు పెరగడంతో తాము భారాన్ని భరించలేకపోతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు.

### అభయహస్తం పేరిట ..

మహాలక్ష్మి పథకంలో భాగంగా తెల్ల రేషన్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం నేటికీ అందజేయటంలేదు. ప్రభుత్వం ప్రకటించిన పైలెట్ గ్రామాల్లో తెల్ల రేషన్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ అవసరమైనన్ని కనెక్షన్లు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. అరకొరగా కనెక్షన్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నది. మిగతా గ్రామాల్లో పెద్దఎత్తున గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఎవరికి ఇవ్వటంలేదు. జిల్లావ్యాప్తంగా ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులతో పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నవారి సంఖ్య రెండులక్షలకు పైగానే ఉంటుంది. కాని, వీటిలో ఏ ఒక్కరికి కూడా కొత్తగా దరఖాస్తులు ఇచ్చిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు.

### పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించి పేదలపై భారాన్ని తగ్గించాలి. ఎన్నికలకు ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే మాట మార్చటం ఎంతవరకు సమంజసం. మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవటం సిగ్గుచేటు. ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి.

- శివరాల జ్యోతి

### అన్నదాతను నిండా ముంచిన

## ఈదురుగాలులు


పాడైన కూరగాయల పంటలను పరిశీలిస్తున్న ఏఈవో సరిత

- 70 ఎకరాల్లో మామిడి.. 20 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం
- 30 మంది రైతులకు రూ.40లక్షల వరకు ఆస్తి నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- పాడైన పంటలను పరిశీలించిన ఏఈవోలు

వికారాబాద్, ఏప్రిల్ 19 : గత రెండు, మూడు రోజులుగా భారీగా వీచిన ఈదురుగాలులతో మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు చెందిన మామిడి, కూరగాయల పంటలు పాడయ్యాయి. మదన్‌పల్లి, మైలార్‌దేవరంపల్లి, గెరిగెట్‌పల్లి, నారాయణపూర్, పెండ్లిమడుగు, సిద్ధులూర్, పాతూర్, కొటాలగూడ తదితర గ్రామాల్లో మామిడికాయలు నేల రాలగా.. కూరగాయల పంటలూ పాడైపోయాయి. మండలంలో సుమారు 70 ఎకరాల్లో మామిడి, 20 ఎకరాల్లో కూరగాయల పంటలు పాడు కాగా.. 30 మంది రైతులకు రూ.40లక్షల వరకు నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటలు సాగు చేయగా.. ఈదురుగాలులు తమకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ, ఉద్యాన వనశాఖల అధికారులు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. 33 శాతం కంటే ఎక్కువ పాడైన మామిడి తోటలు 40 ఎకరాలు కాగా.. 10 మంది రైతులకు నష్టం జరిగిందన్నారు. అదేవిధంగా 10 ఎకరాల్లో కూరగాయలను సాగు చేసిన ఏడుగురు రైతులకు 33 శాతం కంటే ఎక్కువగా నష్టం వాటిల్లిందని.. మొత్తం పంట నష్టం రూ.36 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేసుకుని కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని వారు చెప్పారు.


నేలరాలిన మామిడికాయలు


పాడైన కూరగాయల పంటలు